క్లుప్తంగా

రేపు క్రికెట్ టోర్నమెంట్



పాత గుంటూరు: అమరావతి రోడ్డు బాలాజీనగర్‌లోని షిరిడీ సాయి సేవా ట్రస్ట్ 20 వార్షికోత్సవం పురస్కరించుకుని నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ జి.నారాయణ మూర్తి తెలిపారు. గురువారం ట్రస్టులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 13న 5 కే వాక్, అక్టోబర్ 15న దాతలను సత్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టి.ఆదిలక్ష్మీ, కోర్ కమిటీ సభ్యులు ఇమ్మడి రామకృష్ణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడికొండూరుకు చెందిన ఉల్లిగడ్డల ఆంజనేయులు హనుమాన్‌నగర్ నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడిచేసి అతని నుంచి 140 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పట్నంబజారు: ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారంకు చెందిన పసుపులేటి భాగ్యదీపక్ (24) గుంటూరు నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు మొత్తం ఓ శుభకార్యం నిమిత్తం నెల్లూరు వెళ్లారు. గురువారం స్నేహితులతో కలిసి మద్యం సేవించిన దీపక్ కొద్దిసేపటి తరువాత ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన ఇంటికి వెళ్లేసరికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితులు దీపక్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వీరాంజనేయ జీవధ్వజ ప్రతిష్ట వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి జీవధ్వజ ప్రతిష్ట వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వీరాంజనేయుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్తనామ పూజలు అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో హనుమద్వజానికి విశేషపూజలు, హోమం నిర్వహించారు. సాయంత్రం సువర్చలా సమేత వీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి కోలాట ప్రదర్శన, కర్రసాము, భజన కీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో గోపాలకృష్ణమూర్తి, ఉమావెంకట నాగరత్నమాల, ధర్మకర్తలు రామతారకం, సూర్యనారాయణ, వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట నిరసన

మంగళగిరి: నగరంలోని హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు యూనివర్సిటీల్లో కోర్సులు పెంచాలని, నిలిపివేసిన కోర్సులను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండెల నాసర్ జీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల హక్కు పత్రాల పరిశీలన



ఫిరంగిపురం: జాతీయ రహదారి 167–ఏజీ(కొండమోడు–పేరేచర్ల)నిర్మాణం కోసం రైతులకు సంబంధించిన భూమి హక్కు పత్రాలను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మనాభుడు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. తహసీల్దార్ పద్మనాభుడు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని అమీనాబాద్, తక్కెళ్లపాడు గ్రామాలలో భూ సేకరణ జరుగుతుందని, భూములు ఇవ్వడానికి ఆసక్తి కలిగిన రైతులు భూమికి సంబంధించిన ఒరిజనల్ డాక్యుమెంట్లు, వాటి జిరాక్సు కాపీలు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకములతో హాజరయ్యారని చెప్పారు. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన 16మంది. అమీనాబాద్ గ్రామానికి చెందిన 31మంది రైతులు హక్కు పత్రాలతో హాజరయ్యారని తెలిపారు. వాటిని ఇన్‌చార్జి ఆర్డీఓ శివనారాయణశర్మ పర్యవేక్షణలో కార్యాలయం సిబ్బంది పరిశీలించారన్నారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకూడదు

- వర్షాలకు ముందే ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు పూర్తి చేయాలి
- అధికారులతో నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: వర్షాకాలానికి ముందే నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు పూర్తి చేయాలని, ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా ఏఈలు, ఎమినిటీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. వ్యక్తిగత సెలవులు పూర్తి చేసుకొని నగర కమిషనర్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్న అనంతరం విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీయడానికి ప్రాంతాల వారీగా టెండర్లు పూర్తి అయ్యాయని, ఆయా ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, ఎమినిటీ కార్యదర్శులు పూడికతీత పనులను దగ్గరుండి పర్యవేక్షణ చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో ఏ ప్రాంతంలోను డ్రైన్లు పొంగి ప్రజలు ఇబ్బందులు పడకూడదన్నారు. పూడిక తీసిన తర్వాత ఏఈలు పని పూర్తిగా జరిగిందని ఆథరైజేషన్ చేయాలన్నారు. పూడికతీత పనులను ప్రజారోగ్య విభాగ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, కొన్ని ప్రాంతాల్లో పనులను నేరుగా పరిశీలిస్తానని తెలిపారు. అలాగే నగరంలో వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా, కలుషిత నీరు సరఫరా లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమినిటీ కార్యదర్శులు ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో శాంపిల్స్ తీయాలని, ఎక్కడైనా కలుషిత నీరు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని నోడల్ అధికారులు ప్రతి రోజు లే అవుట్ పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, నగరపాలక సంస్థ ఫిర్యాదుల సెంటర్‌కు అందే ఫిర్యాదుల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రత్యేక సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఎస్ఈ భాస్కర్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్ర, డీసీపీ మూర్తి పాల్గొన్నారు.


రెండు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీనివాసరావుకు డిక్లరేషన్ పత్రం అందించి ఎంపీడీఓ శోభారాణి



తురకపాలెం ఉప సర్పంచ్ విల్సన్ రాజును అభినందిస్తున్న సర్పంచ్ డబ్బారి సూర్యప్రకాశరావు



ఈఓపీఆర్డీ నాగానంద్ నుంచి ఉప సర్పంచ్ నియామక పత్రం అందుకుంటున్న జిలేఖాబి

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం, జొన్నలగడ్డ గ్రామాలలో గతంలో ఉన్న ఉపసర్పంచ్‌లు తమ పదవికి రాజీనామాలు చేయగా, గురువారం ఖాళీగా ఉన్న పదవులకు అధికారులు ఎన్నికను నిర్వహించారు. ఆయా గ్రామాల వార్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి జొన్నలగడ్డ గ్రామ ఉపసర్పంచ్‌గా నామా శ్రీనివాసరావును, తురకపాలెం ఉపసర్పంచ్‌గా బోరుగడ్డ విల్సన్‌రాజును ఎన్నుకోవటం జరిగింది. ఎన్నికలను మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి జె.శోభరాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, రమేష్‌లు పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొమ్మూరు ఉప సర్పంచ్‌గా జిలేఖాబి...

కొమ్మూరు(కాకుమాను): కొమ్మూరు గ్రామ ఉప సర్పంచ్‌గా 1వ వార్డుకు చెందిన మెంబర్ మల్లాయపాలెం జిలేఖాబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఈఓపీఆర్డీ నాగానంద్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా వార్డు మెంబర్లు జిలేఖాబిని గ్రామ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ఈఓపీఆర్డి తెలిపారు. సర్పంచ్ గేరా జ్యోతి, కాకుమాను జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం, పంచాయతీ కార్యదర్శి రంగారావు, వార్డు మెంబర్లు, సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



హోరాహోరీగా పోరాడుతున్న బాపట్ల-హైదరాబాద్ జట్ల క్రీడాకారులు

పెదనందిపాడు: వైఎస్సార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి పలు జట్ల మీద పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాపట్ల, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలలో మూడు సెట్లకు గాను మెదటి సెట్‌లో బాపట్ల 21– హైదరాబాద్ 25, రెండవ సెట్‌లో 25–23, మూడవ సెట్‌లో 15 – 8 పాయింట్లు సాధించాయి. ఈ మ్యాచ్‌లో బాపట్ల విజయం సాధించింది. ముందుగా ఇరుజట్ల సభ్యులను ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సాంబశివరావు, సర్పంచ్‌లు దాసరి పద్మారావు, సాతులూరి సురేష్, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, సేవాశక్తి యూత్ సభ్యులు, పలు జట్ల క్రీడాకారులు, గ్రామస్తులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రాఫ్ట్స్ తయారీపై శిక్షణ



వేసవి విజ్ఞాన శిబరంలో విద్యార్థులతో దేవానంద్, ప్రసాద్, రూనీస్లలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంగా వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తెలిపారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల క్రాఫ్ట్స్ తయారీపై శిక్షణ కల్పించారు. ఈసందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని, నమ్మకాలకు, మూఢ నమ్మకాలకు మధ్య తేడాలు తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాగితాలతో చిన్న, చిన్న మ్యాజిక్ అంశాలను విద్యార్థులకు నేర్పించి తిరిగి వారి చేత చేయిస్తూ సందేహాలను నివృత్తి చేయడం ముఖ్యమైన విషయమన్నారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ఆధ్వర్యంలో పేపర్లతో వివిధ రకాల పూలు, గ్రీటింగ్ కార్డులు, పక్షుల బొమ్మలు, టోపీలు వంటి అనేక రకాల బొమ్మలను తయారు చేయించి, వాటి ఉపయోగాలను తెలియజేశారు. జిల్లా ఉప గ్రంథాలయ పాలకురాలు కె.రూనీస్లలక్ష్మి, ధర్మారెడ్డి, పూర్ణచంద్రరావు, చిన్నపరెడ్డి, పర్వీన్ సుల్తాన్, అచ్చమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీలో సినిమాలు తీసేవారికి ప్రోత్సాహం



తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో సినిమాలు తీసే వారిని ప్రోత్సహిస్తామని, అవసరమైన సహకారం అందించి, తగినవిధంగా సత్కరిస్తామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. గతవారం విడుదలైన అభిలాష సినిమా దర్శకుడు చలువాది శివప్రసాద్‌ను గురువారం సాయంత్రం మా–ఏపీ కార్యాలయంలో సత్కరించారు. నెల్లూరుకు చెందిన దర్శకుడు శివప్రసాద్, తెనాలికి చెందిన పదిమంది కళాకారులకు తన సినిమాలో నటించే అవకాశం కల్పించారనీ, తన సినిమాను ఆంధ్ర రాష్ట్రంలోనే చిత్రీకరించారని తెలిపారు. అందుకోసమే ఆయన్ను సత్కరించినట్టు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్ చేసే నిర్మాణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు రాయితీ ఇచ్చి, మొత్తం 26 జిల్లాలోని లోకేషన్లలో షూటింగులకు ఉచితంగా అనుమతిని ఇస్తున్నట్టు గుర్తుచేశారు. అభిలాష చిత్ర దర్శకుడు చలువాది శివప్రసాద్ మాట్లాడుతూ తమ సినిమా విడుదలకు దిలీప్‌రాజా ఇచ్చిన సహకారం మరువలేమని చెప్పారు. చిత్రంలో విలన్‌గా నటించిన తెనాలి నటుడు బెల్లంకొండ వెంకట్, శ్రీను నాయక్, మన్నే సత్యనారాయణ, నాగలక్ష్మి, రఫీ, అరుణకుమారి, అమీర్‌చౌదరి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి: కఠెవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మైలా భానుప్రసాద్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన మిత్ర మండలి స్థానిక రైల్వేస్టేషను వద్ద పేదలకు అన్నదానం చేసింది. శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తుల్లిమిల్లి చంటి పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడు ఆత్మహత్య



చేబ్రోలు: ఎలుకల మందు తిని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. చేబ్రోలు చెరువులోపాలెం ప్రాంతానికి చెందిన పల్లె రవి (36) కుటుంబ మనస్పర్ధల కారణంగా మద్యంలో ఎలుకల మందు కలుపుకొని సేవించాడు. బంధువులు గమనించి రవిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నగరంపాలెం: ఇటీవల మంగళగిరి పట్టణ పీఎస్ కానిస్టేబుల్ మాధవరావు అనారోగ్యంతో మరణించారు. ఈ క్రమంలో ఆయన భార్య స్వప్నకు వితంతు/ ఫ్లాగ్ పథకం కింద రూ.75 వేల చెక్‌ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కర్ణాటక బ్యాంకులో ఉచిత కంటి వైద్య శిబిరం




తెనాలి: కర్ణాటక బ్యాంక్ శత వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా.. తెనాలి దేవీ చౌక్‌లోని బ్రాంచ్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక హెల్త్ హాస్పిటల్ సౌజన్యంతో పట్టణ, పరిసరాల్లోని ప్రజలకు డాక్టర్ రత్నభూషణ్, అశోక్, శ్రీనివాస్, పుష్పావతి కంటి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన సలహాలను అందించారు. బ్యాంకు తెనాలి శాఖ మేనేజరు ఎం.సుధీర్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజరు ఆర్.సునీల్, బ్యాంకు సిబ్బంది అవినాష్, శ్రీకాంత్, శేషపాణి పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని ఈతేరు సమీపంలో చోటుచేసుకుంది. పొన్నూరు మండల, ములుకుదురు గ్రామానికి చెందిన కట్టా మణికంఠ బాపట్ల నుంచి ములుకుదురు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈతేరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మణికంఠ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్

మంగళగిరి: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి శాఖ గ్రంథాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులతో ముచ్చటించారు. బత్తుల దేవానంద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పిల్లలు సెల్‌ఫోన్లు, ఫేస్ బుక్, వాట్సాప్, వీడియో గేమ్స్‌తో సమయాన్ని వృథా చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గ్రంథాలయాలకు పంపించాలన్నారు. గ్రంథాలయాల్లో లభించే పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించి పుస్తక పఠనంపై శ్రద్ధ తీసుకునేలా కృషి చేయాలన్నారు.

దార్శనికుడు ఆచార్య ఎన్‌జీ రంగా

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ఎన్‌జీ రంగా వర్ధంతి సందర్భంగా ఘననివాళి



ఎన్‌జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: భారత రైతాంగనేత, ప్రముఖ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్‌జీ రంగా దార్శనికుడని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వర్ధంతి సందర్భంగా గురువారం పొన్నూరు సెంటర్‌లో రంగా విగ్రహానికి కిలారి వెంకట రోశయ్య పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు పాల్గొన్నారు.

ఇది భానుడి కర్ఫ్యూ..



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డు

ప్రత్తిపాడు: రోహిణికార్తె వెళ్లిపోయింది. జూన్ నెల వచ్చేసింది. నైరుతి రుతుపవనాలు దేశాన్ని తాకాయి. కానీ ఎండ తీవ్రత మాత్రం తగ్గడం లేదు. భానుడి భగభగలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రత్తిపాడులో నాలుగు రోజులుగా 40 నుంచి 43 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోతున్నారు. ఉక్కపోత కూడా అధికంగా ఉంటుండటంతో వృద్ధులు, చిన్నారులు చెమటదెబ్బకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రహదారులపై సైతం ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అలాంటి చిత్రమే ఇది. గురువారం మధ్యాహ్నం ఒంటిగట సమయంలో ఎండ ధాటికి ప్రత్తిపాడులోని గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డు ఇలా ఖాళీగా కనిపించింది.

వట్టిచెరుకూరు ఎంపీడీఓగా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ



గాజుల శేషగిరిరావు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు ఎంపీడీఓగా గాజుల శేషగిరిరావు బాధ్యతలు చేపట్టారు. చుండూరు మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా చేస్తున్న శేషగిరిరావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ రెండు రోజుల కిందట జిల్లా ఉన్నతాధికారులు వట్టిచెరుకూరు ఎంపీడీఓగా నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం శేషగిరిరావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీడీఓ చెప్పారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

పెదనందిపాడు ఎంపీడీఓగా రాజగోపాల్ ...



యనగం రాజగోపాల్

పెదనందిపాడు: పెదనందిపాడు ఎంపీడీఓ యనగండ్ల రాజగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా మాచవరం నుంచి పెదనందిపాడుకు బదిలీపై వచ్చిన ఆయన గురువారం మధ్యాహ్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిలీల నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరూ రాజగోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో విజయవంతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు.

కనుల పండువగా శాంతి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: మల్లారెడ్డి నగర్ విఘ్నేశ్వర, కుమారస్వామి సహిత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి, విద్యా సరస్వతి, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం రుత్వికులు అనీల్ కుమార్ శర్మ బృందం నిర్వహణలో గోపూజ, మండప దేవతాపూజలు, మూల మంత్రహోమం, మహాపూర్ణాహుతి వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణంలో విశేషంగా పాల్గొన్న భక్తులకు విశేష అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అయ్యప్పస్వామికి అనేక రకాల పుష్పాలతో విశేష పుష్పాభిషేకంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, ఇస్కాన్ పాలకవర్గం, పాల్గొన్నారు.

తాగునీటి సంపులో జారిపడిన ఆవు


క్షేమంగా బయటకు తీసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది



తాగునీటి సంపులో జారిపడిన ఆవును క్షేమంగా బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంగళగిరి: వేసవి దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటి సంపు వద్దకు వెళ్లిన ఓ ఆవు ప్రమాదవశాత్తూ అందులో జారిపడగా అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి క్షేమంగా బయటకు తీసిన ఘటన మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్‌లో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.... నగర పరిధిలోని నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్‌లోని తాగునీటి సంపులో నీటిని తాగేందుకు గురువారం ఓ ఆవు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో జారిపడింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించగా హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వారు సంపులో ప్రమాదవశాత్తూ జారిపడిన ఆవును మూడు గంటలపాటు శ్రమించి క్షేమంగా బయటకు తీశారు. ఆవు ప్రాణాలతో బయటపడడంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు వి శ్రీనివాసరెడ్డి, ఎస్ సాంబశివరావు, ఎం శ్రీనివాసరావు, పీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి, సీహెచ్ శ్యామ్ కుమార్, పి రఘు తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సంపు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఎప్పుడు ఎవరు పడిపోతారోనని భయంగా ఉందని, ఇప్పటికైనా తాగునీటి సంపు ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన



మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడి గ్రామాల రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహనా సదస్సులకు పలువురు స్థానిక రైతులు హాజరయ్యారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న అనేక రకాలైన వ్యవసాయ సంబంధిత రుణాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, తోటల పెంపకం, క్రిషి వాహన్ మొదలగు వాటిపై రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఈ సీజన్‌కు కావాల్సిన వ్యవసాయ రుణాలను పొందవచ్చునని బ్యాంక్ అధికారులు తెలిపారు. గోల్డ్ లోన్స్ రెన్యువల్స్, అగ్రి లోన్స్ రెన్యువల్స్ సకాలంలో చేసుకుని తిరిగి అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చని డిప్యూటీ జనరల్ మేనేజర్ సోమశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు, నూతక్కి, పెదవడ్లపూడి బ్రాంచి మేనేజర్లు రామునాయక్, ఫణికుమార్, కల్లం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.